రేపు, ఎల్లుండి విద్యా సంస్థలకు సెలవులు 6లో..
సాగునీటి సంఘాలకు ఎన్నికలు 7లో..

కిక్కు.. కొందరికే లక్కు..!

- అమిలినేని అనుచరులకు నిరాశ
- రూ.1.70 కోట్లు పెట్టినా.. దక్కింది రెండే
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డికి ఐదు
- అనంత అర్బన్ ఎమ్మెల్యే అనుచరులకు 11
- జేఎన్‌టీయూ లోపల.. బయట సందడే సందడి

అనంతపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ వద్ద మరోసారి ఎన్నికల సందడి కనిపించింది. కౌంటింగ్ సమయంలో ఫలితాల కోసం అభ్యర్థుల అనుచరులు ఎంత ఉత్కంఠగా ఎదురు చూశారో.. అలాంటి పరిస్థితి అన్నమాట..! ఇవీ ఫలితాలే..! కాకపోతే మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ ఫలితాలు. దరఖాస్తు చేసిన వారు లోపల.. వారి అనుచరగణం, బంధుమిత్రులు బయట.. మొత్తంగా రద్దీ భారీగా కనిపించింది. జిల్లాలో 136 ప్రైవేటు మద్యం దుకాణాలకు 3265 దరఖాస్తులు వచ్చాయి. ఎక్కువ మంది పదుల సంఖ్యలో దరఖాస్తు చేశారు. డ్రా కోసం సుమారు రెండున్నర వేల మంది రావడంతో వర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియం కిక్కిరిసింది. కలెక్టర్, జేసీ, ఎస్పీ, ఎక్సైజ్ శాఖ డీసీ తదితర ఉన్నతాధికారులు లాటరీ ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయించారు. మెజార్టీ దుకాణాలను



లక్కీడ్రాలో నంబరును చూపుతున్న జేసీ

టీడీపీ శ్రేణులు దక్కించుకున్నాయి. వైసీపీ వారు ఏడు దుకాణాలను దక్కించుకున్నారు. తనను నమ్ముకున్న పార్టీ కార్యకర్తల కోసం రూ.1.70 కోట్లు వెచ్చించి దరఖాస్తు చేయించిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేనికి లక్కు కలిసిరాలేదు. ఆయన అనుచరులకు కేవలం రెండు దుకాణాలు దక్కడంతో నిరాశకు లోనయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ధర్మవరం నియోజకవర్గంలో ఐదు దుకాణాలను దక్కించుకోవడం విశేషం. మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కూతురు, నంద్యాల జిల్లా నంది గ్రూపు సంస్థలకు చెందిన సుజల జిల్లాలో నాలుగు మద్యం దుకాణాలను దక్కించుకున్నారు. మొత్తంగా మహిళలు 19 దుకాణాలను దక్కించుకున్నారు. (వివరాలు 6లో..)

భారీ వర్షాలు కురుస్తాయ్.. జాగ్రత్త

- విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ సంపత్‌కుమార్ సోమవారం ఆదేశించారు. తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే.. వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. జిల్లా విద్యుత్ సమస్యల పర్యవేక్షణకు నోడల్ అధికారిగా జనరల్ మేనేజర్‌ను (ఐటీ, శాప్) నియమిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. సర్కిల్, డివిజన్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్‌ల కింద నిల్చోవద్దని సూచించారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయినా, లైన్లు తెగిపోయినా తక్షణమే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. టోల్ ఫ్రీ నంబర్లు 1912, 18004251553333 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. 9133331912 నంబర్‌కు చాట్ ద్వారా సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి



మాట్లాడుతున్న సావిత్రి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిలమత్తూరులో అత్తాకోడళ్లపై అత్యాచారం చేసినవారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల వల ఎలాంటి ఘోరాలు జరుగుతున్నాయో అనేందుకు చిలమత్తూరు ఘటనే నిదర్శనమన్నారు. ఇంటి పెద్దమనిషిని, కుమారుడిని కత్తులతో బెదిరించి, కట్టేసి, వారి కళ్ల ఎదుటే భార్య, కోడలిని సామూహిక అత్యాచారం చేసిన ఘటన సిగ్గుచేటన్నారు. మహిళా మంత్రి సవిత, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే మహిళలకు రక్షణ లేకపోవడం ఆందోళనకరమన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో మీ పేరు ఉందా ?

- గ్రామాల్లో ఈ-పంట ముసాయిదా జాబితా ప్రదర్శన

అనంతపురం అర్బన్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఈ పంట నమోదు ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం సోమవారం నుంచి ప్రదర్శిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 16దాకా గ్రామాల్లో ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తారన్నారు. ఈక్రమంలోనే రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా గ్రామ సభలు నిర్వహించి రైతుల పేర్లు చదివి వినిపిస్తారని వెల్లడించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 1054356 ఎకరాల్లో ఈ పంట నమోదుతోపాటు ఈకేవైసీ పూర్తి చేసినట్లు తెలిపారు. ముసాయిదా జాబితాలో ప్రదర్శించిన పేర్లను పరిశీలించి, అభ్యంతరాలుంటే స్థానిక రైతు సేవా కేంద్రం సిబ్బందికి రాత పూర్వకంగా అభ్యంతరాలు తెలపాలని రైతులకు సూచించారు.

న్యూస్ బాక్స్

సత్యసాయి సేవాసమితి ప్రారంభం



నగర సంకీర్తనలో సాయిభక్తులు

ధర్మవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఆర్‌టీ సర్కిల్ సమీపంలోని సుబ్బదాసు సత్రంలో భగవాన్ సత్యసాయి బాబా సేవా సమితిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబాసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా సత్యసాయిబాబా భజనలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి నెలా 24 అన్నదానం, 19న మహిళా డే, ప్రతి రోజూ నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ఇది జేఎన్‌టీయూ టైమ్స్

● వర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు



అనంతపురం సెంట్రల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనంతపురానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. టైమ్స్ హైయ్యర్ ఎడ్యుకేషన్(టి) నిర్వహించిన ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్-2025లో జేఎన్‌టీయూకి 801-1000 ర్యాంక్ బ్యాండ్ దక్కింది. ఇండియాలోని వర్సిటీల్లో 23వ ర్యాంకు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా వీసీ సుదర్శన రావు హర్షాన్ని వ్యక్తం చేస్తూ ర్యాంకింగ్ వివరాలను వెల్లడించారు. బోధన, పరిశోధన, పరిశ్రమల అనుసంధానం, అంతర్జాతీయ దృక్పథం తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న ది సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్యనందించే సంస్థలకు ర్యాంకులను ప్రకటించిందన్నారు. ఈ ర్యాంకుల్లో జేఎన్‌టీయూకి మెరుగైన చోటు దక్కడం హర్షణీమని తెలిపారు. వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ప్రణాళికాబద్ధమైన కృషి ర్యాంకింగ్ రావడానికి దోహదపడిందన్నారు.

క్రీడా సర్టిఫికెట్ల పరిశీలన

● 150మందికిగాను 60మంది హాజరు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసు పోస్టులకు స్పోర్ట్స్ కోటాలో అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించారు. 2019లో విడుదలైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ నోటిఫికేషన్‌లో మిగిలిన మహిళా పోలీస్ పోస్టులకు స్పోర్ట్స్ కోటా అభ్యర్థులను కోర్టు ఆదేశాలతో సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. ఈ కార్యక్రమం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. మహిళా పోలీసు పోస్టులు 24గాను 150మందికి కాల్ లెటర్‌లు పంపగా 60మంది మాత్రమే హాజరయ్యారు. ఎస్పీ ఆఫీస్ సూపరింటెండెంట్ నందకుమార్, ఇన్‌చార్జి డీఎస్‌డీఓ అనిల్‌కుమార్ నేతృత్వంలో అభ్యర్థుల నేషనల్, ఇంటర్నేషనల్, యూనివర్సిటీ, ఎస్‌జీఎఫ్, అసోసియేషన్‌ల, ఫెడరేషన్‌ల వారీగా క్రీడా సర్టిఫికెట్లను పరిశీలించారు. అభ్యర్థుల నుంచి ఆయా క్రీడా సర్టిఫికెట్లు ఒక సెట్ తీసుకున్నారు. అనంతరం సర్టిఫికెట్లను ఆయా సంస్థలు, సంఘాల ద్వారా మరోసారి తనిఖీ చేసి తుది నిర్ణయం తీసుకుంటారు. కార్యక్రమంలో కోచ్‌లు, ఎస్పీ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవితలకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాయలసీమ 8వ మహాకవిసమ్మేళనానికి కవుల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. విభిన్న రంగాల సీమ ప్రముఖులపై కవితలను రాసి, డిసెంబరు 8లోపు 9963917187 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు.

కొనసాగిన పప్పుశనగ రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పప్పుశనగ విత్తనాల కోసం జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో రైతుల పేర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం కొనసాగింది. ఇప్పటి దాకా 13,397 మంది రైతులు 18,808 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

టమోటా కిలో రూ.53

అనంతపురంరూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.53తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.30పలికినట్లు ఆయన తెలిపారు.

1.634 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.634 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 1148 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 1108 క్యూసెక్కులు వెళుతున్నట్లు వారు పేర్కొన్నారు.

లక్కీ లాటరీ..!



హాజరైన దరఖాస్తుదారులు

● మద్యం దుకాణాల లాటరీలో పలువురికి జాక్‌పాట్
● బీజేపీ అనంత జిల్లా అధ్యక్షుడికి ఐదు షాపులు
● మడకశిరలో ఒకే కుటుంబానికి నాలుగు
● అధికార సిండికేట్ కూటమి హవా
● మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తి కిడ్నాప్ హైడ్రామా
● లాటరీ కేంద్రం వద్ద భార్య, బంధువుల ధర్నా
● హిందూపురం వన్‌టౌన్ సీఐ ఎదుట రంగనాథ్ ప్రత్యక్షం
● రేపట్నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల్లో విక్రయాలు



మద్యం దుకాణాల లాటరీని పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మద్యం దుకాణాల లైసెన్సుల జారీ లాటరీ అధికార కూటమికి లక్కీ లాటరీగా మారింది. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో సోమవారం మద్యం దుకాణాలకు లక్కీడ్రా కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 మద్యం దుకాణాలకు 1518 దరఖాస్తులు రాగా.. రెండు టేబుళ్లపై లక్కీడ్రా తీశారు. సిండికేట్‌తో మద్యం దుకాణాల్లో 90శాతానికిపైగా అధికార కూటమి నేతలు, అనుచరగణానికే దక్కాయి. కదిరి, ధర్మవరం, హిందూపురం, చెన్నేకొత్తపల్లి, మడకశిర, పెనుకొండ, తనకల్లు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఐదారు మినహా అన్నీ అధికార కూటమి వశమయ్యాయి. పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అధికార కూటమి నేతలతో పాటు ఔత్సాహికులు, ప్రతిపక్ష పార్టీ నేతలు సైతం భారీగా దరఖాస్తులు చేశారు. లాటరీలో మిశ్రమంగా దక్కాయి. మద్యం దుకాణాల లాటరీకి సోమవారం ఉదయం నుంచి దరఖాస్తుదారులు సాయిఆరామం వద్దకు క్యూకట్టారు. సిండికేట్‌గా దరఖాస్తులు చేసిన వారిలో టెన్షన్ కన్పించలేదు. మిగతావారిలో మాత్రం ఉత్కంఠ నెలకొంది. మహిళలు సైతం మద్యం దుకాణాలకు పోటీ పడ్డారు. యువతతోపాటు చంటిబిడ్డలతో లాటరీకి హాజరయ్యారు. మడకశిర, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. కొందరికి దుకాణాలు దక్కకపోవడంతో నిట్టూరుస్తూ వెనుదిరిగారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందునాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు పాల్గొన్నారు.

లిక్కర్ కిక్కు వారిదే

మద్యం దుకాణాల లక్కీడ్రాలో కొందరిని అదృష్టం వరించింది. ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 20 దుకాణాల్లో మూడు మినహా అన్నీ కూటమి నేతల అనుచరగణానికే దక్కాయి. మంత్రి సత్యకుమార్ యాదవ్ సన్నిహితుడు, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు ఐదు దుకాణాలు దక్కాయి. ధర్మవరం మున్సిపాలిటీ, రూరల్‌లో మూడు, బత్తలపల్లి, ముదిగుబ్బలో ఒక్కోటి వశమయ్యాయి. ధర్మవరంలో టీడీపీ నేత శ్రీశైలం పురుషోత్తం గౌడ్, ముదిగుబ్బలో అదే పార్టీకి చెందిన అన్నమనేని శ్రీనివాసులు, రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లిలో బిత్తిని హరినాథ్, పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్లలో మద్యం వ్యాపారి ఓరుగంటి రవీంద్రనాథ్‌గౌడ్, కదిరిలో టీడీపీ నాయకుడు కందుకూరు గణేష్‌కు రెండు చొప్పున, మడకశిర నగర పంచాయతీ, గ్రామీణ పరిధిలో పీఎస్ వెంకటసుబ్బారెడ్డికి మూడు, ఆయన భార్య వైజయంతిమాల పేరుతో మరో దుకాణాం దక్కాయి. మడకశిర నియోజక వర్గం అమరాపురంలో తల్లికుమారుడు పీఎం పంకజ, పీఎం సుజిత్‌కు రెండు దుకాణాలు దక్కాయి. ఐదు దుకాణాలు దక్కించుకున్న సందిరెడ్డి శ్రీనివాసులు, ఆయన బృందం నియోజక వర్గంలో 27 దరఖాస్తులు సమర్పించారు. మడకశిరలో నాలుగు దకాణాలు దక్కిన పీఎస్ వెంకటసుబ్బారెడ్డి, ఆయన బృందం 29 దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. కనగానపల్లిలో రెండు దుకాణాలకు హరినాథ్ 13 దరఖాస్తులు వేశాడు. హిందూపురంలో టీడీపీ, వైసీపీ నేతలు సిండికేట్‌గా మారి, నియోజకవర్గ వ్యవహారాలు చూసే ఇద్దరు పీఏలు ఏకంగా 9 దుకాణాలకు పలు పేర్లపై 40 దరఖాస్తులు చేశారు. పరిగిలో రెండు దుకాణాలకు మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి వర్గీయులు పోటీపడి 86 దరఖాస్తులు చేశారు.

కిడ్నాప్ కలకలం

లక్కీడ్రాలో చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లికి చెందిన రంగనాథ్‌కు లేపాక్షిలో 57 మద్యం దుకాణం దక్కింది. ఉదయం 10 గంటల సమయంలో రంగనాథ్‌ను హిందూపురానికి చెందిన కొందరు చర్చిద్దామని పిలుచుకెళ్లారు. లాటరీ తగిలిన విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో రంగనాథ్‌తో మాట్లాడేందుకు వారు ప్రయత్నించగా.. ఫోన్ స్విచాఫ్ వచ్చింది. రంగనాథ్ భార్య అశ్విని, కుటుంబ సభ్యులు పుట్టపర్తికి వచ్చి ఆరాతీశారు. హిందూపురానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు.. రంగనాథ్‌ను తీసుకెళ్లినట్లు తెలుసుకున్నారు. తన భర్తను కిడ్నాప్ చేశారంటూ అశ్విని, బంధువులు.. పుట్టపర్తి అర్బన్ పోలీసు స్టేషన్ హిందూరానికి చెందిన మంగేష్, ఆనంద్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం సాయిఆరామంలో మద్యం దుకాణానికి లైసెన్సు ఫీజు చెల్లిస్తామని ఎక్సైజ్ అధికారులకు విన్నవించారు. దరఖాస్తుదారుడే చెల్లించాలని చెప్పడంతో ప్రధాన ముఖద్వారం ఎదుట ధర్నాకి దిగారు. రంగనాథ్‌ను పిలుచుకెళ్లిన వారు యగ్నిశెట్టిపల్లిలోని బంధువులకు ఫోన్ చేసి, రూ.10 లక్షల గుడ్‌విల్ ఇస్తామనీ, ప్రతినెలా రూ.15వేలు ఇస్తామనీ, అందుకు ఒప్పుకుంటే రేపు సాయంత్రానికి రంగనాథ్ వస్తాడంటూ దర్నాకు దిగిన అతడి బంధువులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలంటూ ఒత్తిళ్లు తెచ్చారు. సోమవారం రాత్రిదాకా రంగనాథ్ కిడ్నాప్ హైడ్రామా నడిచింది. ఎట్టకేలకు రంగనాథ్ హిందూపురంలో ప్రత్యక్షమయ్యాడు. వన్‌టౌన్ సీఐ ఎదుట హాజరయ్యాడు. మొబైల్ ఫోన్ మరమ్మతులకు లోనవడంతో భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడలేకపోయాననీ, తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని సీఐ ఎదుట వెల్లడించడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది.



ధర్నా చేస్తున్న రంగనాథ్ భార్య, బంధువులు

మహిళలకు లక్కీ చాన్స్

మద్యం దుకాణాలకు దరఖాస్తుల్లో మహిళలు పోటీపడ్డారు. ఐదుగురికి మద్యం దుకాణాలు దక్కాయి. హిందూపురం మున్సిపాలిటీలో 50వ దుకాణానికి నాగరత్నమ్మ, మడకశిర నగర పంచాయతీలో 78వ షాపునకు వైజయంతిమాల, అమరాపురంలో 83వ దుకాణానికి పంకజ, పుట్టపర్తి నగర పంచాయతీలో 39కి ప్రశాంతి, గాండ్లపెంటలో టంగుటూరి సురేఖకు దుకాణాలు దక్కాయి. జిల్లా వ్యాప్తంగా పలు దకాణాలకు మహిళలు దరఖాస్తులు చేసి సిండికేట్ ముందు నిలువలేకపోయినట్లు చర్చ సాగుతోంది.



చంటిబిడ్డతో హాజరైన మహిళ

కిక్కు.. కొందరికే లక్కు..!

● జేఎన్‌టీయూలో ముగిసిన లాటరీ ప్రక్రియ
● 136 మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి
● 19 దుకాణాలను దక్కించుకున్న మహిళలు



లక్కీ నంబరును చూపుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో సోమవారం కేటాయించారు. జిల్లాలోని 136 మద్యం దుకాణాలకు 3265 దరఖాస్తులు వచ్చాయి. కొందరు ఎక్కువ దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో లాటరీ ప్రక్రియకు 2500 మంది దాకా వచ్చారు. దరఖాస్తుదారులతో వర్సిటీ ప్రాంగణంలో సందడి కనిపించింది. లాటరీ వేదికకు ఉదయం 7 గంటలకే చేరుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. కొందరు దరఖాస్తుదారులు ముందుగానే చేరుకోగా.. మరికొందరు ఆలస్యంగా వచ్చి పరుగులు పెట్టారు. మహిళలు సైతం గణనీయంగా వచ్చారు. యాభై మందికిపైగా మహిళలు లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ్ శర్మ, ఎస్పీ జగదీష్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభమైంది. ముందుగా అనంతపురం అర్బన్‌లోని మొదటి దుకాణం డ్రా తీశారు. మధ్యాహ్నం 2గంటలకు మొత్తం దుకాణాల లాటరీలు తీశారు. లక్కీ డ్రా ప్రారంభం కాగానే దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ కనిపించింది. అనంతపురం అర్బన్‌లో మొదటి దుకాణానికి 44 దరఖాస్తులు వచ్చాయి. 30వ టోకన్ నంబర్ దరఖాస్తుదారు చల్లా లక్ష్మీనారాయణకు ఆ దుకాణం దక్కింది. రెండో దుకాణం ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్య అనుచరుడు గంగారామ్‌కు దక్కింది.



ఉరుకులు.. పరుగులు..


అనుచరులకు నిరాశ

అనంతపురం అర్బన్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అనుచరులు 30 దుకాణాలకు ఏకంగా 300లకుపైగా దరఖాస్తులు సమర్పించారు. లక్కీ డ్రాలో 11 దుకాణాలు మాత్రమే దక్కాయి. మిగిలిన 19 దుకాణాలు మద్యం వ్యాపారులు, తటస్థులకు దక్కాయి. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.1.70 కోట్లు సొంత డబ్బుతో పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేయించారు. మొత్తం 10 దుకాణాలు ఉండగా.. రెండు మాత్రమే అమిలినేని అనుచరులకు దక్కాయి. దీంతో ఎమ్మెల్యేతోపాటు పార్టీ శ్రేణులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. ఇక్కడ ఏకంగా 8 దుకాణాలు మద్యం వ్యాపారులు, తటస్థులకు దక్కాయి.

టీడీపీ శ్రేణులకే మెజార్టీ దుకాణాలు

తాడిపత్రి నియోజకవర్గంలో 20 దుకాణాలకుగాను 10కిపైగా జేసీ అనుచరులకే దక్కాయి. రెండు విజయవాడ వ్యక్తులకు దక్కగా.. మిగిలినవి వ్యాపారులు, తటస్థులకు దక్కాయి. రాయదుర్గం నియోజకవర్గంలో 14 దుకాణాలు ఉండగా... 2 వైసీపీ, 2 తటస్థులకు దక్కాయి. 10 దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. గుంతకల్లు నియోజకవర్గంలో 23 దుకాణాలు ఉండగా... వైసీపీ, జనసేన, నంది గ్రూప్‌లకు ఒక్కొక్కటి దక్కాయి. మిగిలిన దుకాణాలు స్థానిక ఎమ్మెల్యే అనుచరులు, టీడీపీ నాయకులకు దక్కాయి. రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లో మొత్తం 8 దుకాణాలు ఉండగా... రెండు నంది గ్రూప్‌నకు దక్కాయి. ఒకటి తటస్థులకు, మిగిలిన దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. ఉరవకొండ నియోజకవర్గంలో మొత్తం 13 దుకాణాలు ఉండగా.. 2 దుకాణాలు వైసీపీ నాయకులకు, ఒకటి తటస్థులకు దక్కాయి. 10 దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. శింగనమల నియోజకవర్గంలో 18 దుకాణాలు ఉండగా.. 14 దుకాణాలు టీడీపీ శ్రేణులకు, 3 వైసీపీ శ్రేణులకు, ఒకటి తటస్థుడికి దక్కాయి. జిల్లాలో 136 మద్యం దుకాణాల్లో మెజార్టీ దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. వైసీపీ వర్గీయులు ఏడు దుకాణాలను దక్కించుకున్నారు.

మహిళలకు 19 దుకాణాలు



లక్కీ డ్రాకు హాజరైన మహిళలు

జిల్లాలోని 136 దుకాణాల్లో 19 మహిళలకు దక్కాయి. ఇందులో నాలుగు నంద్యాల జిల్లా నంది గ్రూప్ సంస్థలకు చెందిన సుజల దక్కించుకున్నారు. అనంతపురం రూరల్ మండలంలో రెండు, గుంతకల్లు, కళ్యాణదుర్గం రూరల్‌లో ఒక్కొక్క దుకాణాలను దక్కించుకున్నారు. శింగనమల నియోజకవర్గ పరిధిలోని బుక్కరాయసముద్రంలో వైసీపీకి చెందిన పూజారి నారాయణమ్మ లాటరీలో దుకాణం దక్కించుకున్నారు. మిగిలిన 14 దుకాణాలను టీడీపీకి చెందిన మహిళలు దక్కించుకున్నారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌లో సీటు కోసం అర్హులైన గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 22 నుంచి 25 వరకూ రాత పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27న అభ్యర్థులకు రాతపరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు కార్యాలయ సిబ్బంది హిమసాగర్ సెల్ : 8309200704కు సంప్రదించాలన్నారు.

పోరాటయోధుడు సదాశివన్

● ఐదుకల్లుకు ఘన నివాళి



మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం విద్య, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఐదుకల్లు సదాశివన్ గొప్ప పోరాటయోధుడని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆయన 36వ వర్ధంతిని సోమవారం సీపీఐ ఆఫీస్‌లో నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నేతలు ముఖ్య అతిథులుగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాఫర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, హరిజనోద్యమ నాయకుడిగా, ప్రజా సేవకుడిగా, కమ్యూనిస్టుగా సదాశివన్ ఎంతగానో సేవలు అందించారన్నారు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఐదుకల్లు సేవలు చిరస్మరణీయం అన్నారు. శాసన మండలి సభ్యుడిగా పనిచేసినా సాదాసీదాగానే జీవించారన్నారు. ఆయన ఆశయాలను యువ కమ్యూనిస్టులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, నగర సహాయ కార్యదర్శి రమణ, అల్లీపీరా, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సంతోష్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుల్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలి

● భారీ వర్షాలు కురుస్తాయ్.. జాగ్రత్తగా ఉండండి
● అధికారుల సమీక్షలో కలెక్టరు వినోద్ కుమార్



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదికకు వచ్చే ప్రతి బాధితుడి సమస్యను పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులకు కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు బాధితులు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరుతో పాటు డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టరు ఆనంద్ తదితరులు 253మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదులు పెండింగ్ ఉండకుండా సకాలంలో పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జనరేటర్ బ్యాకప్ ఉండాలి..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలోను జనరేటర్ బ్యాకప్ ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్డీఓ కార్యాలయాలలోను, కలెక్టరేట్‌లోను బ్యాకప్ జనరేటర్ ఉండాలన్నారు. వీటి పర్యవేక్షణ కోసం ఓ ప్రత్యేక ఇన్‌చార్జ్‌ను నియమించాలని ఆదేశించారు.

రేపు, ఎల్లుండి విద్యాసంస్థలకు సెలవు

ఈనెల 16, 17 తేదీలలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. వాతావరణం బాగుంటే సెలవులను రద్దు చేస్తామన్నారు. కలెక్టరేట్‌లోను, అన్నిమండల కేంద్రాలలోను ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈనెల16, 17 తేదీలలో పల్లెపండుగ కార్యక్రమాల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుకొని వాయిదా వేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రమాదకరం గా ఉన్న బ్రిడ్జిలు, భవనాలను గుర్తించాలని అక్కడకు ఎవరిని వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టుప్రాంతాలను గుర్తించి ఎక్కడా జనం ఇబ్బందులు పడకుండా, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ట్యాంకులను తహసీల్దార్, మైనర్ఇరిగేషన్‌శాఖ అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఆట్యాంకుల వద్ద వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను పర్యవేక్షణకు నియమించాలని ఆదేశించారు. వర్షాల గురించి ముందుగానే గ్రామాలలో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వ్యవసాయశాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, ఎల్‌డీఎం నర్సింగరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.బీ.దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సాగునీటి సాధన కోసం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈనెల 20 వరకు చేపట్టనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యలయంలో సోమవారం బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల జిల్లా శతాబ్దాలుగా వెనుకబడి ఉందన్నారు. సాగునీటి వనరుల అభివృద్ధికి సరైన చర్యలు చేపట్టకుండా జిల్లాకు అన్ని ప్రభుత్వాలు అన్యాయం చేశాయని విమర్శించారు. ఎగువ తుంగభద్ర, దిగువ శ్రీశైలం డ్యాములు నిండి పొంగి పొర్లుతున్నా మన జిల్లాకు రావాల్సిన నీరు రాకపోవడం దారుణమన్నారు. ఈ పరిస్థితిపై ప్రజాభిప్రాయాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు బస్సుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయం బతకాలంటే కనీసం 30శాతం భూమికి సాగునీటి వనరులు కల్పించాలని జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లో సూచించిందన్నారు. జిల్లాలో నికరంగా 14.85లక్షల ఎకరాల సాగుభూమి ఉందని, ఇందులో స్థిరీకరించబడిన ఆయకట్టు 45,224 ఎకరాలు, అంటే మొత్తం సాగుభూమిలో 3.04శాతం భూమికి మాత్రమే నీటిపారుదల సౌకర్యం ఉందన్నారు. 14 సంవత్సరాల క్రితం ప్రారంభమైన హెచ్చెల్సీ ఆధునికీకరణ అంతులేని నిర్లక్ష్యానికి గురైందన్నారు. 2012 నుంచి హంద్రీనీవా నీరు జిల్లాకు వస్తున్నా ఇప్పటివరకూ పంట కాలువలు లేవన్నారు. సాగునీటి సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు బస్సుయాత్ర, 21న కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతాంగం పెద్దసంఖ్యలో పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, నల్లప్ప పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి.. మహిళ

- పల్లె పల్లెలో ఆమె వెలుగులే..!
- కుటుంబ సాధనకి మూల స్తంభం
- నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం

వ్యవసాయం మన జీవన విధానం. భారత దేశ నిర్మాణం బలమైన పల్లెటూళ్ల పునాదుల మీదే జరిగింది. ఆ పల్లెల ప్రగతి వెనుక పైకి కనిపించని నారీ శక్తి కఠోర శ్రమ ఉంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అయినా, విచ్ఛిన్నం తరువాత ఏర్పడిన చిన్న కుటుంబం అయినా.. ఆమె లేనిదే మనుగడ సాగించలేదన్నది వాస్తవం. వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగం.. ఇలా ఏ రంగంలోనైనా ఆమె పాత్ర ఉండి తీరుతుంది. కుటుంబం విషయంలో అతను లేకపోయినా ఆమె ఏదైనా సాధించగలదు. కానీ ఆమె లేకపోతే అతను గడపలేడు. కుదేలైపోతాడు. ఇందుకు పెద్దగా శోధన అవసరం లేదు. సమీప సమాజాన్ని గమనిస్తే ఇట్టే అర్థమౌతుంది. గ్రామీణ మహిళ శ్రమ గురించి చర్చ జరగాలి. లింగ సమానత్వం అంశం లో ఆమెకు జరుగుతున్న అన్యాయంపైనా చర్చ జరగాలి. వారి విజయాలపైనా చర్చ జరగాలి. అప్పుడే ఆమెకు తగిన గౌరవం, గుర్తింపు లభిస్తాయి. నేడు అంత ర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం. ఈ సం దర్భంగా భర్తను కోల్పోయినా.. మొక్కవోని ధైర్యంతో బిడ్డలను ఉన్నతంగా తీర్చిదిద్దిన ముగ్గురు మహిళల జీవితాలపై కథనం.

అమ్మంటే అమ్మే..!

- కూలి పనులతో కుటుంబ పోషణ
- పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన బిడ్డలు


పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి కల్పిస్తున్న ఆదిలక్ష్మమ్మ కుమారులు

యాడికి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం రాయలచెరువుకు చెందిన కాజె ఆది లక్ష్మమ్మ, సుబ్బరాయుడు దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. సుబ్బరాయుడు చిన్నపాటి కల్లు దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. 1989లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో ఐదుగురు బిడ్డలను పోషించే బాధ్యత, వారి భవిష్యత్తును తీర్చి దిద్దాల్సిన ఆదిలక్ష్మమ్మపై పడింది. ఆనాకొని సంఘటనతో భవిష్యత్తు అంధకారంగా మారింది. అయినా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగింది. భర్త నిర్వహించిన కల్లు దుకాణాన్ని కొనసాగిస్తూనే.. కూలి పనులకు వెళ్లేది. కొడుకులకు అక్షర జ్ఞానం అబ్బే పాఠశాల చదువులను మాత్రమే చెప్పించింది. ఆ తరువాత జీవిత పాఠాలను మాత్రం అత్యంత ఉన్నతంగా నేర్పించింది. వారు కష్టపడే చేతికి రాగానే, నిమ్మకాయల విక్రయానికి వాడే సంచుల వ్యాపారం వారిచేత మొదలు పెట్టించింది. ఆ తరువాత ఇతర వ్యాపారాలలోకి వంపి.. వెనకుండి నడిపించింది. పెద్ద కుమారుడు వెంకటరమణ గౌడ్ నిమ్మకాయల మండీ ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డాడు. మిగిలిన ముగ్గురు కుమారులు లక్ష్మీనారాయణగౌడ్, బాబుగౌడ్, శేఖర్‌గౌడ్ గనుల వ్యాపారంలోకి దిగారు. డోలమైట్ ఖనిజ ఎగుమతులు చేస్తూ పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు. వందమందికి పైగా కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. 'మా అమ్మ కూలి పనులు చేస్తూ మమ్మల్ని పోషించింది. మా భవిష్యత్తు కోసం తను ఎంతో కష్టపడింది. ఆమె కష్టాలను చూస్తూ పెరిగాము. పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగాము..' అని నలుగురు కొడుకులు కన్నతల్లి గురించి గొప్పగా చెప్పుకున్నారు. కూతురుకు మంచి సంబంధం చూసి వివాహం జరిపించింది. భర్త దూరమైన తరువాత మొక్కవోని విశ్వాసంతో ముందుకు సాగి.. బిడ్డల ఎదుగుదలకు బలమైన పునాది వేసింది ఆది లక్ష్మమ్మ.



ఇంతకంటే ఏం కావాలి..?

1989లో నా భర్త చనిపోయాడు. నలుగురు కుమారులు, కూతురును ఎలా పోషించాలో అర్థం కాలేదు. కల్లు దుకాణాన్ని కొనసాగిస్తూనే కూలి పనులకు వెళ్లాను. పిల్లలను క్రమశిక్షణగా పెంచాను. ఇప్పుడు వారు ప్రయోజకులు అయ్యారు. ఫ్యాక్టరీలు పెట్టి పదిమందికి ఉపాధి కల్పిస్తున్నారు. అది నాకు చాలా సంతోషం కలిగిస్తోంది. ఎవరి జీవితాలు వారు గడుపుతున్నారు. నా భర్త మరణించాక కుంగిపోయి ఉంటే నా బిడ్డలు ఏమయ్యేవారో..! ఇలా ఉన్నతస్థాయికి ఎదిగేవారు కాదేమో. చెప్పిన పనిచేసుకుంటూ వారిని ప్రయోజకులుగా మార్చాను. ఇంతకన్నా నాకు ఏమి కావాలి..?

-ఆదిలక్ష్మమ్మ, రాయలచెరువు

అమ్మ శ్రమ.. బిడ్డల విజయం స్ఫూర్తిదాయకం.. ఈశ్వరమ్మ జీవితం


చిన్న కుమారుడు వెంకటేష్, కుమార్తె వెంకటేశ్వరితో ఈశ్వరమ్మ

యాడికి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం పెద్దపేట గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, శ్రీనివాసులు దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఎనిమిదేళ్ల క్రితం శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. ముగ్గురు బిడ్డలతో ఈశ్వరమ్మ జీవితం అగమ్యగోచరంగా మారింది. భర్తను కోల్పోయిన బాధ, బిడ్డల భవిష్యత్తు ఏమౌతుందో అనే దిగులు ఆమెను వెంటాడింది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు సొంతూరిలోనే ఉపాధి మార్గాన్ని ఎంచుకుంది. పాడిపశువులు, గొర్రెలు, కోళ్ల పెంపకంతో ఆదాయాన్ని సమకూర్చుకోవడం ప్రారంభించింది. ఎన్ని కష్టాలు ఎదురైనా బిడ్డలను చదువుకు దూరం చేయలేదు. పెద్దకుమారుడు పవన్‌కుమార్ బీటెక్ పూర్తి చేశాడు. ఆ తరువాత ఆర్టీటీ సహకారంతో డిప్లొమో ఇన్ ఫారిన్ లాంగ్వేజ్ (జర్మన్) కోర్సు చేయించింది. ఇప్పుడు పవన్ హైదరాబాద్‌లో డెలాయిట్ నెక్స్ట్ సంస్థలో ప్రాసెస్ సూపర్‌వైజర్‌గా, మంచి వేతనంతో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు వెంకటేష్ కూడా డిగ్రీతోపాటు డిప్లొమో ఇన్ ఫారిన్ లాంగ్వేజ్ (స్పానిష్) పూర్తి చేశాడు. బెంగళూరులోని లైఫ్ సైన్స్ సంస్థలో రీజనల్ సీనియర్ అనలిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు వెంకటేశ్వరి బెంగళూరులోని ప్రముఖ బ్యాంకులో మంచి వేతనంతో ప్రాసెస్ సీనియర్ అనలిస్ట్‌గా ఉద్యోగం చేస్తోంది. ఒక ప్రైవేటు మహిళ.. భర్తను కోల్పోయినా, బిడ్డల బాధ్యతను నెత్తికెత్తుకుని మొండి ధైర్యంతో ముందుకు సాగింది. బిడ్డలు ముగ్గురు ఉన్నతంగా ఎదిగి.. అమ్మ శ్రమకు తగిన ఫలితాన్ని ఇచ్చారు.


పెద్దకుమారుడు పవన్‌కుమార్ వివాహంలో ఈశ్వరమ్మ కుటుంబం

నా కష్టం పిల్లలకు వద్దని..

చిన్నపుటి నుంచి కష్టాలలో పెరిగాను. వ్యవసాయ పనులకు వెళ్లేదాన్ని. నా భర్త ఆకాలమరణంతో ముగ్గురు బిడ్డలను ఎలా పోషించుకోవాలో అని బాధపడేదాన్ని. మా అన్న ధైర్యం చెప్పారు. పిల్లలకోసం కష్టాలను ఎదుర్కోవాలని అన్నారు. అన్న చెప్పినట్లుగా పిల్లల కోసం రేయింబవళ్లు కష్టపడ్డాను. పశువులు, గొర్రెలు, కోళ్లను పెంచాను. పిల్లలను బాగా చదివించుకున్నాను. ఇప్పుడు వారు ప్రయోజకులయ్యారు. ముగ్గురూ వారివారి ఉద్యోగాలు చేసుకుంటూ సంతోషంగా, సుఖంగా ఉన్నారు. పెద్ద కుమారుడికి వివాహం చేశాను. ఇంతకన్నా ఆనందం ఏముంటుంది..?


ఈశ్వరమ్మ, పెద్దపేట, యాడికి మండలం

కన్న బిడ్డల కోసం.. కన్నీటిని దిగమింగి.. జీవితాన్ని గెలిచిన అరుణ


ఆశాగా పని చేస్తున్న అరుణ

విడపనకల్లు: విడపనకల్లు మండలం పాల్తికి గ్రామానికి చెందిన అరుణకు గుత్తికి చెందిన రంగానాయకులుతో 1992లో వివాహం జరిగింది. ఎనిమిదేళ్ల అనంతరం బ్రెయిన్ ట్యూమర్‌తో రంగనాయకులు మృతిచెందారు. ముగ్గురు పిల్లలతో అరుణ దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంది. గుండె దిటవు చేసుకుని జీవన పోరాటాన్ని ప్రారంభించింది. చిన్న వయసులోనే భర్త మృతి చెందడంతో కొందరు రెండో పెళ్లి ఆలోచన చేయమన్నారు. కానీ బిడ్డలే తన సర్వస్వం అనుకుంది అరుణ. కన్నీటిని దిగమించుకుని ముందుకు సాగింది. అత్తారింటిలో ఆదరణ కరువై.. పుట్టింటికి చేరుకుంది. తల్లిదండ్రులు, తోబుట్టువులు ఆమెను అక్కున చేర్చుకున్నారు. ఇంటర్ వరకు మాత్రమే చదివిన ఆమె.. ఉపాధి కోసం కుట్టు పని నేర్చుకుంది. దుస్తులు కుడుతూ, పది మందికి కుట్టు నేర్పుతూ బిడ్డలను పోషించడం ప్రారంభించింది. ఆ తరువాత చిన్నగా దుస్తుల వ్యాపారం, మహిళలకు కావాల్సిన వస్తువుల విక్రయాన్ని ప్రారంభించింది. అలా సంపాదించిన సొమ్ముతో కొడుకు సుధీర్ కుమార్, కూతుళ్లు పావని, రమ్యను చదివించింది. ఒక దశలో ముగ్గురి చదువు భారం కావటంతో ఎమ్మిగనూరులో ఉన్న తన చెల్లెలు సుగుణ సాయం తీసుకుంది. కూతుళ్లను కొన్నేళ్లపాటు ఆమె వద్ద ఉంచి చదివించింది. ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదురైనప్పుడు ఆమెకు అన్న, ఇద్దరు చెల్లెళ్లు తోడుగా నిలిచారు.

టీడీపీ హయాంలో ఉద్యోగం


కుట్టు మిషన్‌పై అరుణ

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో.. పదేళ్ల క్రితం అరుణకు ఆశా వర్కర్‌గా పాల్తికిలోనే ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమె ఆర్థిక ఇబ్బందులు కొంత తగ్గాయి. ఆశా కార్యకర్తగా గ్రామస్థులకు సేవలు అందిస్తూనే.. తీరిక సమయంలో ఇంట్లో కుట్టు పనులను కొనసాగిస్తోంది. పావని ఇంటర్ వరకూ చదివింది. రమ్యను డిగ్రీ పూర్తి చేసింది. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిపించింది. వారికి మంచి జీవితాలను అందించింది. కొడుకు సుధీర్ కుమార్ బీటెక్ పూర్తి చేసి.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యాడు. హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడు. ఏటికి ఎదురీదిన అరుణ.. బిడ్డలకు మంచి జీవితాన్ని ఇచ్చింది.

పుట్టింటి ఆదరణతోనే..



నేను భర్తను కోల్పోయిన తరువాత అత్తమామల నుంచి పెద్దగా ఆదరణ దొరకలేదు. నా ముగ్గురు పిల్లల్ని తీసుకుని పుట్టింటికి చేరుకున్నాను. అమ్మ, నాన్న, తోబుట్టువులు నన్ను ఆదరించారు. ఒకరికి భారం కాకూడదని అమ్మానాన్నల సహకారంతో కుట్టు మిషన్ నేర్చుకున్నాను. కుట్టు, అల్లికలు నేర్పుతూ 15 సంవత్సరాలు కాలం గడిపాను. పదేళ్ల క్రితం ఇదే గ్రామంలో ఆశా వర్కర్‌గా ఉద్యోగంలో చేరాను. గ్రామస్థులకు నా వంతుగా సేవ చేస్తున్నాను. కష్టాలను ఎదుర్కొంటూనే ముగ్గురికీ శక్తి మించి చదివించాను. నాకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు నా తోబుట్టువులు ఆదుకున్నారు. ఎంతో కష్టపడి ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిపించాను. నా కొడుక్కి వివాహం చేస్తే నా బాధ్యత తీరిపోతుంది.

-అరుణ

శ్రీకారం

- సాగునీటి సంఘాల బలోపేతానికి చర్యలు
- సంఘాలకు ఎన్నికల నిర్వహణకు సిద్ధం
- ప్రాజెక్టుల వారీగా ఆయకట్టు రైతుల జాబితా సిద్ధం
- రేపటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- 194 సంఘాలకు ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈక్రమంలోనే వాటి ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి సంఘాలు పూర్తిగా నిర్వీర్యమైపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈనెల 16 నుంచి నవంబరు 24లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా పరిధిలోని ఆయా ప్రాజెక్టులు, ఆయా డిస్ట్రిబ్యూటరీ పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. సాగునీటి సంఘాల ఏర్పాటుతో ఆయకట్టు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది.

హెచ్చెల్సీ పరిధిలో 99 సాగునీటి సంఘాలు

తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) పరిధిలో 99సాగునీటి సంఘాలను గుర్తించారు. వీటి పరిధిలో 2,70,809 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో హెచ్ఎల్ఎంసీ 11 సాగునీటి సంఘాల పరిధిలో 35,541 ఎకరాల ఆయకట్టు ఉంది. మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ 5 సంఘాలకు 13,325 ఎకరాలు, మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్‌కు 10 సంఘాలకు 29,577ఎకరాల ఆయకట్టు ఉంది. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద 25,478ఎకరాల ఆయకట్టుకు 9 సంఘాలు ఉన్నాయి. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 11సంఘాల కింద 32,072 ఎకరాలు, కర్నూలు జిల్లాలోని ఆలూరు బ్రాంచ్ కెనాల్ 14,255 ఎకరాల ఆయకట్టుకు 6 సంఘాలు ఉన్నాయి. కడప జిల్లాలోని జమ్ములమడుగు 10సంఘాలకు 22,625ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రొద్దుటూరు 10 సంఘాలకు 24,524ఎకరాలు ఉంది. ఎర్రగుంట్ల 9సంఘాలకు 23,392 ఎకరాలు, కనసూరు 5 సంఘాలకు 8,843ఎకరాలు, సింహాద్రిపురం 8 సంఘాలకు 24,670ఎకరాలు, ఆచ్యుల్లి 5 సంఘాలకు 16,507ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తంగా అనంతపురం జిల్లాలో 5డిస్ట్రిబ్యూటరీ సంఘాల పరిధిలో 46సాగునీటి సంఘాలు, కర్నూలు ఒక డిస్ట్రిబ్యూటరీ కింద 6 సాగునీటి సంఘాలు, కడప లో 6 డిస్ట్రిబ్యూటరీల కింద 47సాగునీటి సంఘాలు ఉన్నాయి. మొత్తం హెచ్చెల్సీ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీల కింద 99 సాగునీటి సంఘాలను గుర్తించారు.


తుంగభద్ర ఎగువ కాలువ

మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 సాగునీటి సంఘాలు...

మైనర్ ఇరిగేషన్ పరిధిలో జిల్లాలో 95 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మేజర్ ప్రాజెక్టుగా భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్టు కింద 6, చెరువులు 89 మొత్తం 95సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కో అసోసియేషన్‌కు 20-50 ఎకరాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా టీసీ(టెరిటోరియల్ కానిస్టిట్యూయెన్సీ) ని ఎన్నుకుంటారు. టీసీలు కనీసం 6-12 మంది కలిసి వాటర్ యూజర్ అసోసియేషన్‌లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. సాగునీటి సంఘాలు కలిసి ప్రాజెక్టు అసోసియేషన్‌ను ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ మొత్తం ఈనెల 16 నుంచి నవంబరు 24లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సాగునీటి సంఘాలను తొక్కేశారు



ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి సం ఘాలను తొక్కేశారు. ఆయకట్టు రైతుల ఎప్పుడూ మాట్లాడకుండా నోరు నొక్కేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా సాగునీరివ్వాలని అడిగకుండా సంఘాలనే లేకుండా చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆయకట్టుదారుల సమస్యలను గుర్తించి, రైతుల పక్షాన చాటేందుకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలనుకోవడం శుభపరిణామం. సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆయకట్టుదారులు పూర్తి మద్దతు తెలుపుతున్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం. అధికారులకు పూర్తిగా సహకరిస్తాం.

- బాలకృష్ణ, సాకెనాల్ మాజీ ఉపాధ్యక్షుడు

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం



హెచ్చెల్సీ, మైనర్ ఇరిగేషన్ పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆయకట్టుదారులు, సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీల వారీగా ఓటర్ల జాబితా తయారు చేశాం. ఓటర్ల జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేశాం. ఈనెల 16 నుంచి నవంబరు 24లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ అధికారులతో కలిసి సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ సాగుతుంది.

- రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ, సాగునీటి సంఘాల ఎన్నికల నోడల్ అధికారి

కార్పొరేట్ కంపెనీలను రద్దు చేయాలి

నగరంలో ఆటోడ్రైవర్ల ర్యాలీ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల పొట్టకొడుతున్న రాపిడో బైక్స్, ఓలా, ఉబెర్, బ్లాబ్లా వంటి కార్పొరేట్ కంపెనీలను రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ న్యూ అనుబంధం ఆటోడ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్టీఆర్ భవన్ నుంచి క్లాక్‌టవర్, సుభాష్‌రోడ్డు, సప్తగిరి సర్కిల్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆటోనే నమ్ము కుని జీవిస్తున్న కార్మికుల పొట్టకొడుతున్న కార్పొరేట్ కంపెనీలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలపై అసెంబ్లీ, పార్లమెంట్‌లో చర్చించి పాలకులు న్యాయం చేయాలని కోరారు. వ్యక్తిగత వాహనాలను వ్యాపారానికి వాడకుండా చూడాలని, రాపిడో బైక్‌లను ఆటోస్టాండ్ల దగ్గర రాకుండా ఉంచి, మరణ వాతావరణాన్ని నివారించాలని కలెక్టర్, ఆర్టీఓలను కోరారు. వ్యాపారాలకు ఉపయోగించే వాహనాలకు తెల్లనంబరు ప్లేట్ల స్థానంలో పసుపు రంగుని వాడేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, రాజా, హాజీవలీ, సుధాకర్, నాగభూషణం, మల్లేశ్వర పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న ఆటోకార్మికులు

ఏటీఎంలో చోరీకి యత్నం

నార్పల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బ్రిడ్జి వద్ద ఉన్న ఏటీఎంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. సెక్యూరిటీ లేకపోవడాన్ని గుర్తించిన దుండగులు ఏటీఎం లోపలి భాగంలో ఉన్న బాక్స్‌ను పగులగొట్టారు. ఎంత ప్రయత్నించినా లోపల ఉన్న డబ్బు బాక్స్ రాకపోవడంతో వారు పోలీ యత్నాన్ని విరమించుకున్నారు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. స్టేట్ బ్యాంకు వెళ్లి సీసీ కెమెరాలు పరిశీలించారు. ఏటీఎంలో ఎంత నగదు ఉందని బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించారు. ఏటీఎంలో రూ.36వేలు మాత్రమే ఉందని, ఎలాంటి నగదు పోలేదని బ్యాంకు అధికారులు వెల్లడించారు. ఇది దొంగల పనికాదని, ఆకతాయిల పనేనని, సీసీ కెమెరాలు పరిశీలించామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

3 నుంచి ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఏపీ వెటరన్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు అధ్యక్షుడు మద్దా రామలింగారెడ్డి తెలిపారు. ఆర్డీటీ స్టేడియంలో నవంబరు 3 నుంచి లీగ్ పద్ధతిలో టోర్నీ ఉంటుందన్నారు. సెలవు దినాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 23లోపు ఆసక్తి ఉన్న ఉద్యోగులు తమ ఎంట్రీలను పంపాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9490062555, 7386958866లను సంప్రదించాలని కోరారు.

గల్లంతైన విద్యార్థి మృతి

కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి సవిత


మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్‌లోపడి ఆదివారం గల్లంతైన చంద్రశేఖర్ రెడ్డి(19)అనే విద్యార్థి మృతదేహం సోమవారం లభ్యమైంది. పెనుకొండ మండలం అమ్మవారిపల్లికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి అనే డిగ్రీ విద్యార్థి తోటి స్నేహితులతో కలిసి ఈత కోసం ఆదివారం మధ్యాహ్నం గొల్లపల్లి రిజర్వాయర్‌కు వెళ్లారు. రిజర్వాయర్‌కు వస్తున్న కాలువలో ఈత కొడుతుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం 10గంటల సమయంలో మృతదేహం నీటిలో తేలింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసులతో విచారణ అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మంత్రి వెంట టీడీపీ నాయకులు చిన్నవెంకటరాముడు, పోతిరెడ్డి పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు

నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తీవ్రగాయాలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కంటైనర్‌ను కారు ఢీ కొన్న సంఘటన మండలంలోని న్యామద్దల సమీపంలో సోమవారం ఉదయం జాతీయ రహదారిపై జరిగింది. ఈ ప్రమాదంలో కర్ణాటకకు చెందిన నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన వీరేశ్, సంగనాథ్, సిద్ధలింగ, హరీశ్‌లు గుల్బర్గా నుంచి కారులో బెంగళూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో న్యామద్దల సమీపంలోకి రాగానే కారు ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఆపి ఉన్న కంటైనర్ వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. కారు ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జైంది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


కంటైనర్ వెనుక భాగంలో ఇరుక్కున్న కారు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీ లెక్కింపు

● రూ.22.48 లక్షల ఆదాయం

ఆత్మకూరు అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని పంపనూరు సుబ్రమ్మణ్యేశ్వర స్వామివారి హుండీని అధికారులు సోమవారం లెక్కించారు. ఆర్నెల్లుగా భక్తులు దేవస్థానంలోని హుండీ ద్వారా సమర్పించిన కానుకలతో రూ. 22,48,779 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారి బాబు తెలిపారు. ప్రతి ఆర్నెల్లకు ఒకసారి స్వామివారి హుండి లెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని దేవాదాయ శాఖ ఖాతాకు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ తనఖీ అధికారి వన్నూరు స్వామి, గ్రామ పెద్దలు, భమ రాంబిక సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ సహాయక అధికారి శ్రీరాములు సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిక్షణకు అభ్య ర్థులు ఈ నెల 21వ తేదీలోగా ఆన్‌లైన్ జ్ఞాన భూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు గుండె, కంటి వైద్యశిబిరం

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీఓ నగర శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, నగర ప్రజల కోసం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ హెచ్ఎల్సీ కాలనీలోని తహసీల్దార్ కార్యాలయం వెనుకవైపు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో చికిత్సలు చేస్తారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతోపాటు నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొందిరెడ్డిపల్లి విద్యార్థిని


స్రవంతి

రాప్తాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న స్రవంతి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నరేంద్ర నాథ్ సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా స్రవంతిని హెచ్ఎం నరేంద్రనాథ్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, పాఠశాల పీడీ రవితేజ, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

కనగానపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంచెర్ల, సీఎస్‌కోట గ్రామాల్లో ఆదివారం రాత్రి దుండుగులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్ చోరీ చేశారు. తూంచెర్ల గ్రామానికి చెందిన ముత్యాలు, లక్ష్మీనారాయణ, యాతం రమణ, సీఎస్‌కోట గ్రామానికి చెందిన సదానంద అనే రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చూ డగా గుర్తుతెలియని దుండుగలు వాటిని ధ్వంసం చేసి అందు లో కాపర్, ఆయిల్ చోరీ చేసినట్లు కనిపించిందని వాపోయారు. విద్యుత్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి: సీఐటీయూ

అనంతపురం క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు నగరపాలిక అధికారులకు విన్నవించారు. నగర పాలిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో సీఐటీయూ నాయకులు ఏటీఎం నాగరాజు, నాగభూషణం కార్మికుల సమస్యలను వివరించారు. గత ఇరవై ఏళ్లుగా పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ కార్మికులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. వారికి మెరుగైన వైద్యం అందించడం లేదన్నారు. కార్మికులకు బకాయి వేతనాలివ్వాలని కోరారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

రామగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగంపల్లి తండాకు చెందిన శ్రీరామ్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంత తీసుకుంటున్నాడు. అయనను ఎమ్మెల్యే పరిటాలసునీత సోమవారం పరామర్శించారు. వారం రోజుల క్రితం ఆయన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సలు పొందాడు. ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట టీడీపీనాయకులు రామ్మూర్తినాయుడు, మాజీ ఎంపీపీ పరందామయాదవ్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రామగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికివాండ్లపల్లిలో కావ్య అనే మహిళ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలతో టీడీపీ నాయకులు, క్రీడాకారులు

అనంతపురంరూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు పురస్కరించుకుని మండలంలోని చియ్యేడు గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం పోటీల్లో తుది మ్యాచ్ నిర్వహించారు. ఇందులో గ్రామానికి చెందిన బ్లాక్ బస్టర్స్ జట్టు గెలుపొందగా, తగ్గ గేర్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విజేతలకు, రన్నర్స్‌కు, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, చంద్రాయుడు, మహేష్ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. జట్టు సభ్యులు తలారి చంద్ర, బోయపాటి నాగార్జున, చందు, మధు, టీడీపీ నాయకులు ప్రసాద్, పరమేశ్వర్‌రెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

వర్షాల వేళ అప్రమత్తంగా ఉండండి

● ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

అనంతపురం విద్య, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిలాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు వర్షాలు కురుస్తున్న వేళ అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ వరకూ తుఫాన్ వల్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు, తల్లులు సురక్షితంగా ఉండేలా చూడాలన్నారు. ఏదైనా అంగన్‌వాడీ కేంద్రం కారుతున్నా, వర్షాలకు పడిపోయేలా ఉన్నా, ముంపునకు గురయ్యేలా ఉన్నా వెంటనే సురక్షిత భవనానికి మార్చాలని సూచించారు. అదేవిధంగా కేంద్రంలోని సరుకులు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పీడీ తెలిపారు. చిన్న పిల్లలకు స్వెట్టర్లు, టోపీలు ధరించేలా చూడాలని, గర్భిణులు 9 నెలలు నిండినా లేదా ప్రసవానికి దగ్గరగా ఉన్నా...వెంటనే అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, ఆశా వర్కర్, ఏఎన్ఎంను సంప్రదించేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

రాప్తాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని రైతులు, ప్రజలకు ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే ఫిర్యాదు చేయడానికి రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. ఈనెల 18 వరకూ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఘనంగా పల్లె పండుగ ప్రారంభం

● కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాలకు పూర్వవైభవం
● పల్లెపండుగ వారోత్సవాల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత


హంద్రీనీవా జలాలకు గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుండటంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే పరిటాలసునీత పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం దాదులూరు పంచాయతీలో ఆమె పర్యటించారు. ముందుగా దాదులూరు పోతలయ్య స్వామిని దర్శించుకుని, హంద్రీనీవా ద్వారా చెరువులకు వస్తున్న కృష్ణజలాలకు గంగపూజ చేశారు. అనంతరం దాదులూరు పంచాయతీలో రూ.41లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి, శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కోసం పల్లె పండుగ కార్యక్రమం చేపట్టామన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్నపనులలో నాణ్యత లోపిస్తే బిల్లులు రావన్నారు. మున్ముందు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లపట్టాలతో పాటు పరిటాల రవీంద్ర పేరుమీద కాలనీలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ అనిల్‌కుమార్, డీఈ నారాయణస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశ్, కన్వీనర్ యాతం పోతలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధాకర్‌చౌదరి పాల్గొన్నారు.


కురుగుంటలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం


గార్లదిన్నెలో...


శింగనమలలో...

పల్లె పండుగ వారోత్సవాలు

అనంతపురం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట, అక్కంపల్లి తదిరతర గ్రామాల్లో కార్యక్రమాన్ని చేపట్టారు. కురుగుంటలో ఏపీఓ చంద్రకళ, ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండలంలోని గార్లదిన్నె, ఇల్లూరుల్లో రూ. 15 లక్షల నిధులతో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. సర్పంచు సుబ్బమ్మ, ఏపీడీ విజయ్ కుమార్, ఎంపీడీఓ యోగానందరెడ్డి, పీఆర్ జేఈ శ్రీనివాసులు, ఏపీఓ నాంచారమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మణ్, నాయకులు గేటుక్రిష్ణారెడ్డి, పాండు, గుత్తా బాలకృష్ణ, జయరాం, ఈశ్వర్‌రెడ్డి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

నార్పల: మండల కేంద్రంలో సోమవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.88.85లక్షలు నిధులతో 15సీసీ రోడ్లు, మినీ గోకుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. మాజీ ఎంపీపీ ఆకుల అరుణ, డీఎల్‌డీఓ లలితాబాయి, మండల ప్రత్యేకాధికారి రామసుబ్బరెడ్డి, ఎంపీడీఓ గంగావతి, ఈఓఆర్డీ శైలజరాణి, సర్పంచు సుప్రియ, ఏపీఓలు ఎర్రమ్మ, రమేష్, రామారావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: పల్లె పండుగ సందర్భంగా సోమవారం మండలంలోని బండమీదపల్లి, హంపాపురం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీఓ విజయకుమారి, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, ఏపిఓ సావిత్రి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీ టీసీ రవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : పల్లె పండుగలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకుడు శశాంక చౌదరి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహులు, జేఈలు పార్థసారథి, శివకుమార్, ఏపీఓ సుజాత, టీడీపీ నాయకులు మనోరంజన్, రవీంద్రారెడ్డి, కందుళ ఓబులపతి, రామదాసు అక్కులన్న, తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: పల్లె పండుగ కార్యాక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో రూ.38లక్షలతో సీసీరోడ్లు పనులకు భూమి పూజ చేశారు. తహసీల్దార్ బ్రహ్మయ్య ఎంపీడీఓ నిర్మాలకూమారి, ఈఓపీఆర్‌డీ వెంకటలక్ష్మి, ఏపీఓ శ్రీదేవి, టీడీపీ నాయకులు వెంకటేశ్ , సత్తి, మాసూల చంద్ర భూమిపూజ చేశారు.


ఆత్మకూరులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం


నార్పలలో భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీపీ ఆకుల అరుణ


బండమీదపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

రూ.10 నాణెంపై అపోహలు వీడండి

● చలామణిలో ప్రతి ఒక్కరూ స్వీకరించాల్సిందే
● ఎల్‌డీఎం, కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రూ.10నాణెంతో పాటు ఇతర నాణేలు మార్కెట్‌లో చెలామణిలో ఉన్నాయని... ప్రతి ఒక్కరూ నాణేలు స్వీకరించాలని ఎల్‌డీఎం నర్సింగరావు తెలిపారు. రూ.10, ఇతర నాణేలపై ప్రజల్లో ఉన్న అపోహాలను తొలగించేందుకు సోమవారం ఎల్‌డీఎం, కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని హోటళ్లు, బ్యాంకులు, తోపుడుబండ్లు, వ్యాపార సముదాయాల్లో వారు నాణేల వినియోగంపై అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు రూ.10నాణెం, ఇతర నాణేలు మార్కెట్లో చెలామణిలో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ స్వీకరించాలని సూచించారు. రూ.10నాణేన్ని ఎవరైనా తిరస్కరించినట్లైతే, తమ దృష్టికి తీసుకువస్తే అలాంటి వారిపై చర్యలకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెనరాబ్యాంకు డివిజనల్ మేనేజర్లు షేక్ మహబూబ్, సెంతిల్‌కుమార్, మేనేజర్ దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజేపీఎస్‌కు ఐఎస్ఓ గుర్తింపు


సర్టిఫికెట్ అందుకుంటున్న పాఠశాలల కన్వీనర్ సంగీతకుమారి

నార్పల, అక్టోబరు14(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతి రావు పూలే గురుకుల బాలికల పాఠశాల కు ఐఎస్ఓ(ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్)సర్టిఫికెట్ వచ్చినట్లు గురుకుల పాఠశాలల కన్వీనర్ సంగీత కుమారి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ సంగీతకుమారి మా ట్లాడుతూ... దేశంలో మొదటిసారిగా ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకున్న ప్రభుత్వ గురుకుల పాఠశాల అని తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా కార్పొరేట్ పాఠశాల లకు దీటుగా విద్యాబోధన, పాఠశాల నిర్వహణ అందిస్తున్న పాఠశాలగా గుర్తింపు రావడానికి పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రతిఒక్కరి కృషితోనే సాధ్యమైందని ఆమె తెలిపారు. పాఠశాల సిబ్బందికి ప్రిన్సిపాల్ సంగీతకుమారి, పలువురు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● సెక్స్‌వర్కర్లతో డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సెక్స్ వర్కర్లు అందరిలాగే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ సూచించారు. కోర్టు హాల్‌లో సోమవారం సెక్స్ వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి వారికి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఇటుక నల్లప్ప, స్థానిక ఎన్జీఓ సభ్యులు మాట్లాడుతూ సెక్స్ వర్కర్ల బాధలు, అవసరాలను వివరించారు. అనంతరం న్యాయాధికారి పరిష్కార మార్గాలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో దస్తగిరిస్వామి గంధం ఊరేగింపు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రిలయన్స్ మార్ట్ సమీపంలో చైతన్యనగర్ లోని 'షాహే గౌసే ఆజం' దర్గాలో నిర్వహిస్తున్న దస్తగిరి స్వామి గ్యార్మి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం గంధం ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత దర్గాలో మతపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రికి గంధం ఊరేగింపు నిర్వహించారు.

బకాయిలు చెల్లించాకే టెండర్లు పిలవాలి

● వాటర్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికుల వేతన బకాయిలు, పీఎఫ్ చెల్లించాకే నూతన టెండర్లు పిలవాలని ఆ తాగునీటి పథకాల కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ సప్లై స్కీమ్‌లకు టెండర్లు జరుగుతున్న నేపథ్యంలో వాటిలో కార్మిక సంక్షేమ చట్టాలు అమలయ్యేలా చూడాలన్నారు. పీఎఫ్, గ్రాట్యుటీ, ఈఎస్ఐ, బోనస్, సమానపనికి సమాన వేతనం అమలయ్యేలా టెండర్లలో పొందుపరచాలన్నారు. స్కీమ్‌లో పనిచేసి రిటైర్డ్ అయిన 42 మంది కార్మికులు, చనిపోయిన ఆరుగురు కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. 2021 నుంచి బోనస్ చెల్లించకుండా వాయిదా వేస్తూ వస్తున్నారని, చెల్లించే ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శి శ్రీనివాసులు, చిన్న, త్రిలోక్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగండి

● నూతన ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ హితబోధ


నూతన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ప్రొఫెసర్లు

అనంతపురం టౌన్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తి ఎంతో విలువైనదని, అందరూ క్రమశిక్షణతో ఉంటూ కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని మెడికల్ కలాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు నూతన మెడికోలకు హితబోధ చేశారు. కళాశాల ఆడిటోరియంలో సోమవారం 2024-25 విద్యాసంవత్సరం నూతన ఎంబీబీఎస్ విద్యార్థులకు ఓరియెంటేషన్ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... అనంత వైద్య కళాశాలకు మంచిపేరు ఉందన్నారు. ఇక్కడ విద్యార్థులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదవడం, క్రమశిక్షణతో మెలగడం నేర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్‌సోనియా, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్స్ నవీన్‌కుమార్, షంషాద్‌బేగం, మదు,చలపతి, శ్యామ్‌ప్రసాద్, పద్మశ్రావణి పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


ఆర్థిక సాయం చెక్కును పాస్టర్లకు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్/ కల్చరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. జీసెస్ నగర్‌లోని ఫెయిత్ చర్చ్‌లో సోమవారం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యప్రసంగీకులుగా పాస్టర్ విజయ్‌కుమార్, ముఖ్యఅథితిగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రస్తుతం క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పాస్టర్లకు గత మూడు నెలలుగా గౌరవ వేతనం అందడం లేదని, వారికి వచ్చే నెలలో అందజేస్తామన్నారు. క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి తాను వ్యక్తిగతంగా కృషి చేస్తానన్నారు. ఆయన చేతుల మీదుగా 21మంది పాస్టర్లకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం అందించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు కొండవీటి సుధాకర్‌నాయుడు, పాస్టర్ విజయ్‌కుమార్, క్రిస్టియన్ సెల్ నాయకులు ఈటె స్వామిదాస్, పాస్టర్ నెహమ్యా నాగరాజు పాల్గొన్నారు.

అల్లావలి ఉరుసు ఉత్సవాల పోస్టర్ల విడుదల

అనంతపురం అర్బన్: కర్నూలు జిల్లా ఆలూరు సమీపంలోని గట్టుమల్లయ్య కొండ వద్ద వెలసిన సయ్యద్ షా అల్లావలి, అంగార్ వలి సాహెబ్ ఉరుసు ఉత్సవాలకు ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉరుసు ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు.

20 నుంచి స్పోర్ట్స్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఉమ్మడి జిల్లా క్రీడా ఎంపిక పోటీలు ఈనెల 20 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్-19 కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. అన్ని పోటీలు బాల, బాలికల క్యాటగిరీలో ఉంటాయన్నారు. హ్యాండ్‌బాల్ పోటీలు ఈ నె 20న ప్రభుత్వ న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో, 22న రుద్రంపేటలోని నారాయణ టెన్నిస్ అకాడమీలో టెన్నిస్, సాఫ్ట్‌టెన్నిస్ క్రీడా పోటీలు, అలాగే 23న ప్రభుత్వ న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో త్రోబాల్, టెన్నీకాయిట్, క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24న న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో సైక్లింగ్, మాల్కమ్ పోటీలు, 25న విద్యారణ్యస్కూల్‌లో ఆర్చరీ, 26న అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 30న ఎస్కేయూ సమీపంలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్విమ్మింగ్, నవంబరు 1న అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో జిమ్నాస్టిక్, బాక్సింగ్ పోటీల నిర్వహణ ఉంటుందని తెలిపారు. వివరాలకు సెల్ ఫోన్ నంబరు 9441284618ను సంప్రదించాలని కోరారు.

నేడు పల్లె పండుగకు ఎమ్మెల్యే రాక

పుట్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకటవేముల గ్రామంలో మంగళవారం నిర్వహించే పల్లెపండుగకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బాల రంగయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి ఆమె భూమిపూజ చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

గుత్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీ వరకు భారీ వర్షాలు పడనున్నాయని, దీంతో పట్టణ ప్రజల సౌకర్యార్థం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా సోమవారం తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఏమైనా విపత్తులు జరిగితే ప్రజలు కంట్రోల్ రూం 9100986895కు ఫిర్యాదు చేయాలన్నారు. తక్షణమే సహాయక చర్యలు చేపడుతామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివశించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణంలో కోట జిల్లా పరిషత్ పాఠశాల, కర్నూలు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గుత్తిఆర్ఎస్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి

పామిడి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు స్థానికులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... పట్టణంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అడ్రస్ మార్పు, మొబైల్ నెంబర్ లింకు, కొత్త ఆధార్ కార్డు తీసుకునేందుకు ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కనుక ఇక్కడే ఆధార్ కేంద్రంను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, నక్కల రామాంజనేయులు, నల్లబోతుల వీర ప్రతాప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన పప్పుశనగను వినియోగించుకోండి

ఉరవకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేసే సబ్సిడీ విత్తన పప్పుశనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శుభకర్ సూచించారు. మండలంలోని కౌకుంట్లలో సోమవారం యన రైతులకు విత్తన పప్పుశనగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 3,500క్వింటాళ్ల ప ప్పుశనను కేటాయించారన్నారు. రాయితీ పోనూ రైతులు క్వింటాకు రూ.7050లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటిదాకా 1626మంది విత్తన పప్పుశనగకు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చెప్పారు. పట్టణంలో టీడీపీ నాయకులు, రాకెట్లలో అధికారులు విత్తన పంపిణీ చేపట్టారు. కార్యక్రమాల్లో మాజీసర్పంచ్ ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, వడ్డేలాల్‌స్వామి, నిమ్మలప్రసాద్, రాజేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని వేల్పుమడుగు, విడపనకల్లు, పాల్తూరు గడేకల్లు తదితర గ్రామాల్లో సబ్సిడీ విత్తన పప్పుశనగను రైతులకు పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది వాటిని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామం సచివాలయంలో సుమారు వందమంది రైతులకు 150 క్విం టాళ్ల విత్తన పప్పుశనగను టీడీపీ నాయకుడు శరభనగౌడ పంపిణీ చేశారు. నాయకులు నాగరాజు, వేమురెడ్డి, హరినాగేంద్ర, శర్మాస్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌డీటీ బాషా బాధ్యతల స్వీకరణ

బెళుగుప్ప, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల సీఎస్‌డీటీగా బీఎం బాషా మండలకేంద్రంలో మహిళాశిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి సీఎస్‌డీటీ బదిలీపై వెళ్లగా ఆ స్థానంలోకి అనంతపురం నుంచి బీఎం బాషా బదిలీపై వచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కూడేరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎం ఈఓ-1 మహమ్మద్ గౌస్, ఎంఈఓ-2 సాయికృష్ణను యూటీఎఫ్ నాయకులు కోరారు. మండలకేంద్రంలో నాయకులు సిదన్న, చంద్రమోహన్, వెంకటప్ప, సంపత్, చంద్రశేఖర్, దస్తగిరి తదితరులు ఇద్దరు ఎంఈఓలను సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

తాడిపత్రి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ.. స్థానిక పెన్నానది నుంచి నిత్యం ఇసుక అక్రమంగా తరలిపోతోందన్నారు. దీనిని అరికట్టకపోతే భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉందన్నారు. ప్రజలకు తాగడానికి నీరు కూడా నీరు దొరకదన్నారు. కనుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు పురుషోత్తం, రామేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, సురేష్, నాగరంగయ్య, రామాంజనేయులు, లింగమయ్య, గంగావతి పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

బొమ్మనహాళ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనేహాళ్ గ్రామంలో సోమవారం ఏడుగురు మట్కా బీటర్లను పోలీసులు అరెస్టు చేసారు. గోనేహాళ్‌లో ఏడుగురు మట్కా పట్టీలు రాస్తుండగా సిబ్బందితో కలిసి దాడులు చేసి పట్టుకున్నామని ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి మట్కా పట్టీలుతోపాటు రూ.13,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.20 వేల నగదు, మట్కాపట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు. మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం దాడులు చేశామన్నారు.

ఆటో అపహరణ

తాడిపత్రి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో సోమవారం గంగినాయుడు అనే వ్యక్తి ఆటోను గుర్తుతెలియని దుండగులు చోరిచేశారని పట్టణ పోలీసులు తెలిపారు. అయ్యవారిపల్లికి గ్రామానికి చెందిన గంగినాయుడు పట్టణంలో ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. రోజు మాదిరిగానే ఆటో నడుపుతూ మార్కెట్‌వద్ద నిలిపి లోపలికి వెళ్లాడు. తిరిగివచ్చి చూసేసరికి ఆటో కనిపించలేదు. పరిసరాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఈ ఏడాది ఫిబ్రవరిలో పట్టణంలోని కృష్ణాపురం 3వరోడ్డులో నివాసం ఉంటున్న నాగార్జునకు చెందిన ఆటో చోరీ అయింది. పలుచోట్ల వెతికినా కనిపించకపోవడంతో సోమవారం బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రతన్‌టాటాకు ఘన నివాళి

కుందుర్పి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా విలువలబడుల్లో సోమవారం పారిశ్రామికవేత్త రతన్‌టాటాకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విలువల బడుల కోఆర్డినేటర్లు, సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం

గుత్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్యవైశ్య సంఘం వారు వసంతోత్సవంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వాసవీ అమ్మవారి దేవాలయం నుంచికోట ముఖద్వారం వరకు వాసవీ అమ్మవారిని ఊరేగించారు. ఊరేగింపులో ఒకరిపై ఒకరు రంగులు చల్లకుంటూ వసొంతోత్సవం జరిపారు. ఆర్యవైశ్యులు, స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



వసంతోత్సవం జరుపుకుంటున్న ఆర్యవైశ్యులు

ఊరూరా.. వేడుకగా పల్లె పండుగ



ఉరవకొండలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు



గుంతకల్లు మండలం దంచెర్లలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకుడు నారాయణ స్వామి



గుమ్మఘట్ట మండలం మారెంపల్లి గ్రామంలో సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

● పలు అభివృద్ధి పనులకు భూమిపూజ
● పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం తలపెట్టిన పల్లెపండుగ కార్యక్రమం గ్రామగ్రామాన సోమవారం వేడుకగా జరిగింది. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూట మి నాయకులు ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కింద పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేపట్టా రు. ముఖ్యంగా సీసీరోడ్ల నిర్మాణానికి, గోకులం షె డ్లు, పారంఫాండ్ల ఏర్పాటుకు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. అలాగే పలువురు రైతుల పొలాల్లో మామిడి మొక్కలు నాటారు. అనంతరం పలువురు కూటమి నాయకులు, మండల అధికారులు మాట్లాడుతూ.. పల్లెపండుగ కార్యక్రమంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు కూటమిప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.4500 కోట్లను అభివృద్ధి పనులకు కేటాయించిందన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు.



శెట్టూరు మండలం చిన్నంపల్లిలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న అధికారులు



పుట్లూరు మండలం సూరేపల్లిలో..



తాడిపత్రి మండలం చిన్నపొలమడలో..

చంద్రబాబుతోనే సుపరిపాలన: ఎమ్మెల్యే కాలవ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

డీ.హీరేహాళ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు తోనే సుపరిపాలన సాధ్యమని, ఆయన వల్లే ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని సోమలా పురం, వసగుడ్డం, నాగలాపురం, తిమ్మలాపురం గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. సోమలాపురంలో రూ. 10 లక్షల వ్యయంతో, వసగుడ్డంలో రూ. 26 లక్షల వయ్యంతో, నాగలాపురంలో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే వసగుడ్డంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ అనాలోచిత నిర్ణయాలకు ప్రజలు నరకం చూశారన్నారు. రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే సీఎం చంద్రబాబు సంక్షేమం అంటే ఏంటో చేసి చూపించారన్నారు. ప్రస్తుతం గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ పేరుతో శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం స్థానిక టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ గంగాధర, నాయకుడు మొండి మల్లికార్జున, పంచాయతీ రాజ్ డీఈ సుధాకర్‌నాయక్, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ దాస్ నాయక్, ఏఈ సుధాకర్, సర్పంచులు దొనప్ప, హనుమంతరెడ్డి, నారాయణస్వామి, గోవిందు, వెంకటేష్, రామాంజినేయులు, వన్నూరుస్వామి, శ్రీరాములు పాల్గొన్నారు.

కూలిడబ్బు కోసం వెళ్లి.. కుప్పకూలాడు..

బొమ్మనహాళ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూలీ డబ్బుల కోసమని యజమాని ఇంటి వద్దకు వెళ్లిన ఓ వ్యవసాయ కూలి అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ నరేంద్ర తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దర్గాహోన్నూరు గ్రామానికి చెందిన హెచ్.హనుమంతు(42) అదే గ్రామానికి చెందిన బసవరాజు అనే రైతు వద్దకు ఆదివారం కూలి డబ్బుల కోసం వెళ్లాడు. అయితే అతను బసవరాజు ఇంటి వద్ద ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. భర్త మృతిపై అనుమానం ఉందని భార్య నాగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహానికి బళ్లారి విమ్స్‌లో పోస్టు మార్టం నిర్వహించామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.


ఇద్దరు ఎన్‌సీసీ కేడెట్లకు గోల్డ్ మెడల్

రాయదుర్గం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు శివప్రసాద్, గోపాల్ ట్రెకింగ్ క్యాంప్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి సోమవారం పేర్కొన్నారు. తిరుపతిలో ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ట్రెకింగ్ క్యాంప్‌లో శివప్రసాద్, గోపాల్ పాల్గొని కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జట్ల వాలీబాల్ పోటీలో 6వ ఆంధ్ర బెటాలియన్ కర్నూలు గ్రూపులో ప్రాతినిథ్యం వహించి గోల్డ్‌మెడల్ సాధించారని తెలిపారు.

రేషన్ సరుకుల కోసం ఎదురుచూపులు

బెళుగుప్ప, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రేషన్ దుకాణాల వద్ద నిత్యావసర సరుకుల కోసం లబ్ధిదారులు ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రతి నెల 10వ తేదీలోగా రేషన్ సరుకులు లబ్ధిదారులకు అందేవి. అయితే ఈనెల దసరా పండుగ వెళ్లినా సరుకులు పంపిణీ జరగలేదు. దీంతో లబ్ధిదారులు ఎదరుచూస్తున్నారు. ఇంకె న్నడు సరుకులందిస్తారని కోరుతున్నారు. ముఖ్యంగా బెళుగుప్పలోని 1,2 రేషన్ దుకాణాల్లో, కోనంపల్లిలో 36వ షాపు, గుండ్లపల్లిలో 12వ షాపులో సరుకులు పంపిణీ కాలేదు. వీటిపై తహసీల్దార్ షర్మిల సోమవారం మాట్లాడుతూ ఈ డిపోలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారని, నివేదికలు జిల్లా ఉన్నతాధికారులకు పంపారని, అధికారుల నుంచి అనుమతి రాగానే పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గరుడవాహనంపై చింతలరాయుడు



గరుడవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

తాడిపత్రి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తికి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం గరుడవాహనంపై మంగళవాయిద్యాల నడుమ ప ట్టణ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. తొలుత ఆలయంలో మూ లవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు.

టీ దుకాణంపై దాడి

తాడిపత్రి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగులకట్ట వెనుక వైపు ఉన్న టీ దుకాణంపై ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దాడి చేశారని పట్టణ పోలీసులు తెలిపారు. స్థానికుడైన మధుకుమార్ అనే వ్యక్తి టీదుకాణం నడుపుతూ జీవనం సాగించేవాడు. కాగా ఆదివారం రాత్రి దుండగులు దాడి చేసి అందులోని అద్దాలను, బండలను పగులకొట్టారు. దీంతో బాధితుడు సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యాడికిలో ఉద్రిక్తత

● వైన్‌షాపు ఏర్పాటు కోసం ఇరువర్గాల ప్రయత్నం

యాడికి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వైన్‌షాపు ఏర్పాటుపై సోమవారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. మండలానికి సంబంధించి నాలుగు మద్యం దుకాణాలకు సోమవారం లాటరీ నిర్వహించారు. ఇందులో మూడు వైన్‌షాపులు టీడీపీ వర్గీయులకు, ఒక వైన్‌షాపు వైసీపీ వర్గీయులకు దక్కింది. మండలకేంద్రంలో వైసీపీ వర్గీయులు వైన్‌షాపు ఏర్పాటుకు బస్టాండ్ వద్ద ఒక గదిని అద్దెకు తీసుకుంటూ యజమానితో అగ్రిమెంట్ చేసుకున్నారు. కాగా రాత్రి 8 గంటల సమయంలో వైన్‌షాపు ఏర్పాటు కోసం గది పరిశీలనకు టీడీ పీ నాయకులు గుంపులుగా వచ్చారు. వైసీపీ వర్గీయులకు గది అద్దెకు ఇచ్చిన వ్యక్తి ఇంటివద్దకు వెళ్లి మాట్లాడారు. అదే సమయంలో వైసీపీ వర్గీయులు గుంపులుగా అక్కడకు రావడంతో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఇరువర్గాలు చెరొకవైపు గుంపులుగా ఏర్పడ్డారు. ఆ సమయంలో ఒకరిపై ఒకరు ఎక్కడ దాడులకు పాల్పడతారోనని ఆందోళన స్థానికుల్లో మొదలైంది. సమాచారం అందుకున్న సీఐ ఈరన్న సిబ్బందితో అక్కడకు వచ్చి ఇరువర్గీయులతో మాట్లాడి పంపించివేశారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లుటౌన్/రాయదుర్గం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14నుంచి 16వరకు భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉందని, వి విధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉన్నందున వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందన్నారు. వీటితో ప్రజలకు ఎలాం టి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, తహసీల్దారు రమాదేవి, సీఐలు మస్తాన్, మనోహర్, అగ్నిమాపక అధికారి అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం మండలంలో రాబోవు మూడు రోజులలో భారీ వర్ష సూచన ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నాగరాజు ప్రకటనలో తెలిపారు.

ఏంది రుద్రప్పా.. ఇలా చేశావ్?



రుద్రప్ప (ఫైల్)

నాన్న మందలించేది
నీ బాగు కోసమేనని అర్థం చేసుకోలేకపోయావా?
ఒకవేళ నాన్న తిడితే
తిండి మీదో లేక మరేదానిమీదో అలగాలి
కానీ ఇలా ఆత్మహత్య చేసుకుంటావా?
ఇంటికి పెద్ద కొడుకువి నువ్వే ఇలా చేసి పోతే
అమ్మానాన్నలు, తోబుట్టువులు
ఎంత కుమిలిపోతారో ఆలోచించలేకపోయావా?
కాస్త స్థిమితంగా ఆలోచించి ఉంటే
అఘాయిత్యానికి పాల్పడేవాడివి కాదేమో..?

డి.హీరేహాళ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మురడి గ్రామంలో సోమవారం వెలుగుచూసింది. మురడి గ్రామానికి చెందిన నాగేంద్ర, విశాలమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. వీరు వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవించేవారు. పెద్ద కుమారుడైన రుద్రప్ప(15) పనులకు కూడా అక్కడా ఇక్కడా తిరుగుతూ కాలం గడిపేవాడు. దీంతో కుటుంబపోషణ భారంగా మారింది. ఈక్రమంలోనే తండ్రి నాగేంద్ర మూడురోజుల కిందట పనులకు వెళ్లకుండా ఊరికే ఉంటే కుటుంబ మనుగడ ఎలా సాగుతుందని కుమారుడు రుద్రప్పను మందలించాడు. ఆమాటలకు మనస్తాపం చెందిన రుద్రప్ప మూడురోజుల కిందట ఇంటి నుండి వెళ్లిపోయాడు. మరుసటి రోజు తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు గొడిశలపల్లి గ్రామ సమీపంలోని హెచ్చెల్సీ వద్ద రుద్రప్ప సెల్ఫీ వీడియో తీసి గ్రామంలోని తన స్నేహితులకు పంపాడు. వారు విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేశారు. అప్పటి నుంచి హెచ్చెల్సీ పరిసర ప్రాంతాల్లో రుద్రప్ప కోసం అతడి తల్లిదండ్రులు, స్నేహితులు వెతకసాగారు. అయినా కనిపించలేదు. ఈ తరుణంలోనే సోమవారం మధ్యాహ్నం కణేకల్లు మండలం యర్రగుంట గ్రామ సమీపంలోని హెచ్చెల్సీలో ఓ శవం కనిపించింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి చూడగా ఆ మృతదేహం రుద్రప్పదే అని గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తండ్రి నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

నీటితొట్టెలో పడి బాలుడి మృతి



రామకిషోర్ (ఫైల్)

గుమ్మఘట్ట, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 14: మండలంలోని బీటీపీ గ్రామంలో సోమవారం నీటి తొట్టెలో మునిగి రామకిషోర్(6) మృతి చెందాడు. వన్నూరప్ప, జ్యోత్స్నల ఏకైక కుమారుడు రామకిషోర్ ఆడుకునేందుకు ఆంజనేయస్వామి గుడి వద్దకు మధ్యా హ్నం వెళ్లాడు. ఎంతసేపైన బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆం దోళనతో పరిసర ప్రాంతాలన్నీ గాలించా రు. చివరకు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. చివరకు సాయంత్రం ఆంజనేయస్వామి గుడి సమీపంలో నీటితొట్టెలో బాలుడు శవమై కనిపించడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కొన్నేళ్లుగా బిడ్డల కోసం ఎంతో తపించిన వన్నూరప్ప, జ్యోత్స్నలకు పుట్టిన బిడ్డ అకాల మరణం చెందడంతో వారు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

ఎలుగుబంట్ల దాడిలో కళింగర పంట ధ్వంసం



నాశనమైన కళింగర పంటను చూపుతున్న రైతు

బెళుగుప్ప, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎలుగుబంట్ల దాడితో చేతికొచ్చిన కళింగర పంట ధ్వంసమైందం టూ మండలంలోని బెళుగుప్ప తండాకు చెందిన రైతు సేవ్యా నాయక్ వాపోయారు. బాధిత రైతు సోమవారం మాట్లాడుతూ.. తాను మూడు ఎకరాల్లో రూ. 2.50 లక్షలు ఖర్చు పెట్టి కళింగర సాగుచేశానన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట కొంత దెబ్బ తిన్నదన్నారు. మిగిలిన కాస్తా పంటను అమ్ముకుందామని ఆశతో ఉండగా.. వారం రోజుల నుంచి ఎలుగుబంట్లు తోటలోకి చొరబడి నాశనం చేస్తున్నాయన్నారు. అటవీశాఖ అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

కణేకల్లు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కణేకల్లు క్రాసింగ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. కుందుర్పి మండలం ఎనుములదొడ్డికి చెందిన బోయ కరెన్న(56) కళ్యాణదుర్గంలోని వివేకానంద కాలేజీలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం తెల్లవారుజామున ఆయన బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో పాండురంగ స్వామి మాల వేసుకునేందుకు వెంకటేశులు అనే వ్యక్తితో కలిసి బైక్‌లో బయలుదేరాడు. కణేకల్లు క్రాసింగ్ వద్దకు రాగానే వీరి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ప్రమాదంలో కరెన్న అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశులు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

తాడిపత్రి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోరాటకాలనీలో నివాసం ఉంటున్న రామాంజనేయులు వద్ద మారణాయుధాలు ఉన్నాయని సమాచారం అందడంతో పోలీసులు సోమవారం అతడి ఇంటిని తనిఖీ చేశారు. ఇంటిలో కొడవండ్లు, రాడ్లు లభించడంతో వాటిని సీజ్‌చేసి రామాంజనేయులుపై కేసు నమోదుచేశారు.